

# ప్రేమపాఠశాల

సీతాసత్య

**"ప్రేమించడమెలా?"**

**లైబ్రరీలో న్యూస్ పేపర్ తిరగేస్తోన్న సుబ్బారావు కళ్ళ బడిందా ప్రకటన. ఒక్క క్షణం కూడా ఆలస్యం చేయలేదు అతడు. రెండున్న సెంటీమీటర్ల పొడవున్న ఆ ప్రకటనను ఆసాంతం రెండు మూడు సార్లు చదివి, చిరునామాను మన సులో మననం చేసుకుంటూ లైబ్రరీ ఆవరణను దాటాడు.**

చింతచెట్టు క్రింద పార్క్ చేసి ఉన్న సైకిల్‌ను అధి రోహించి పదిహేను నిముషాల్లో ఒక పెంకుటింటి ముందుకు చేరుకున్నాడు. అప్పటికే చాలా రకాల వాహనాలక్కడ ఆగి ఉన్నాయి. ఆ ఇంటి ముందు జనం గుంపులు గుంపులుగా తిరుగుతున్నారు. విష యం ఆరాతీసి తాను కూడా ఓ టోకెన్ కొన్నాడు పది రూపాయలు సమర్పించుకుని.

నాలుగ్గంటలు ఓపిగ్గా ఎదురు చూశాక అతడికి పిలుపొచ్చింది లోపల్నించి. ఠీవిగా నడుచుకుంటూ లోపలకు వెళ్ళాడు. ఆ గదిలో ఉన్న పొడవాటి బల్ల వెనుక కూర్చుని ఉంది సాదాసీదాగా ఉన్న ఓ అమ్మా యి. ఆ బల్ల మీద ఓ లావుపాటి రిజిస్టరుంది. అతణ్ణి చూసి తన ఎదురుగా ఉన్న రిజిస్టర్‌ను అతడి ముందుకు తోసి పెన్ అందించిందా అతివ యాంత్రి కంగా. ఆమె అందించిన పెన్నందుకుని రిజిస్టర్‌లోకి చూశాడు సుబ్బారావు.

'వయసు, ఎత్తు, రంగు, లావు, చదువు, హాబీ లు, ఇంతకు ముందెవరినైనా ప్రేమించారా? మీరు ప్రేమలో పడిందెవరితో? పక్కింటి అమ్మాయితోనా? చుట్టాల పాపతోనా? క్లాస్‌మేట్‌తోనా? ఆ అమ్మాయిదీ మీదీ కులమూ, మతమూ, ఒకటేనా? ఇప్పటి వరకూ మీరు చేసిన ప్రయత్నాలేవిటి?' వగైరా ప్రశ్నలున్నా యందులో.

ఆ వివరాలన్నీ పూర్తి చేసేసరికి పది నిముషాలు పట్టిందతడికి. అతణ్ణించి తిరిగి పెన్ అందుకుం టూ, 'నెక్స్ట్' అందామె.

తెల్లబోయాడు సుబ్బారావు.

ఓ ప్లాస్టిక్ బిళ్ల నతడి కందించి, ''పద హారు రోజుల తర్వాత సాయంత్రం అయిదుంపావుకు రండి'' అని మరోసారి 'నెక్స్ట్' అందామె.

నీరసంగా కాళ్ళీడ్చుకుంటూ ఇంటికి చేరాడు సుబ్బారావు సైకిల్ని ఓ చేత్తో నడిపించుకుంటూ. ఆ తరువాత పదహారు రోజులూ పదహారు యుగాల్లా గడిపి, ప్లాస్టిక్ బిళ్ళను జేబులో వేసుకుని ఆ పెంకు టింటి ముందుకు చేరుకున్నాడు సుబ్బారావు.

అతడందించిన బిళ్ళను టేబిల్ డ్రాయర్‌లో పడేసి, సైక్లోస్టైల్ చేయబడిన ఓ కాగితాల కట్టను

చేత్తో పట్టుకుని, ''యాభై రూపాయలు'' అంది బల్ల వెనుక కూర్చున్న పిల్ల.

మారు మాట్లాడకుండా పర్స్‌లోని చిల్లరంతా ఊడ్చి సమర్పించుకుని ఆ కాగితాల కట్టనందుకుని బయటపడ్డాడు.

ఆ తరువాతి సంఘటనలు చాలా వేగంగా జరిగాయి అతడి జీవితంలో. డబ్బిచ్చి కొనుక్కున్న సలహాలననుసరించి ఆరు నెలలుగా అతడు ప్రేమిస్తోన్న మధుబాలకు ధైర్యం చేసి అతడందించిన ప్రేమ లేఖకు సమాధానంగా, మధుబాలనుంచికాక కాలేజీ ప్రిన్సిపాల్ నుంచి కబురొచ్చిందతడికి.

తన ఛాంబర్‌లోకి ప్రవేశించిన సుబ్బారావును ఎగాదిగా చూస్తూ, చేతిలోని కాగితాన్ని అటూ ఇటూ ఆడిస్తూ, ''ఈ ఉత్తరం వ్రాయడానికి ప్రత్యేకమైన శిక్షణేమైనా తీసుకున్నావా?'' అన్నాడు ఆయన చాలా మామూలుగా.

''మీకెలా తెల్సింది సార్?'' అన్నాడు సుబ్బారావు ఒకింత ఆశ్చర్యపోతూ.

చేతిలోని కాగితాన్ని ఉండలా చుట్టి అతడి మొహం మీదకు విసురుతూ, ''ఇలా'' అని ''ఇహ ముందిటువంటి పన్లు చేస్తే టీ.సీ. నీ వీపుకంటించి నిన్నిలానే ఉండ చుట్టి బయటకు విసిరేస్తాను. జాగ్రత్త!'' అంటూ హూంకరించాడు ప్రిన్సిపాల్.

○○○

రోజూ ముప్పొద్దులా సుష్టుగా భోంచేసి, కుంభకర్ణుడి వారసుడిలా నిద్రపోతూ, చీపురు కట్టతో వీపు మీద చరిస్తేనేగానీ నిద్రలేవని కొడుకు, ఇటీవల సరిగా తిండి తినకుండా, తెల్ల వార్లూ మేలుకునే ఉండడం చూసి సుబ్బారావు తల్లి హృదయం ద్రవించిపోయింది.

ఎవరి దృష్టయినా తగిలిందేమోనని రోజూ నాలుగు సార్లు దృష్టి తీసింది కూడా. అలా వారం రోజులు గడిచాక ఎండు మిరప కాయల ఖర్చు తప్ప మరేమీ లాభం కనబడక పోవడంతో మెదడుకు పని కల్పించి... చివరకు ఓ శుభోదయాన తేలిగ్గా చిరునవ్వు నవ్వింది సుబ్బారావు తల్లి.

అప్పుడు సుబ్బారావు తండ్రి, భార్య అందించిన కాఫీని నోటి ముందుంచుకోబోతున్నాడు. తమ పెళ్ళయిన కొత్తల్లో భార్య ఎప్పుడూ నవ్వకపోవడం గమనించిన సుబ్బారావు తండ్రి అమితంగా విచారపడి పోయాడు చాలా సార్లు. కానీ ఓ రోజు నవ్వక నవ్వక నవ్విన ఆమె నవ్వును ముచ్చటగా చూసిన సుబ్బారావు తండ్రికి ఆ తర్వాత అర్థమైంది, తన భార్య నవ్వకుండా ఉండడం తన సుఖానికెంత అవసరమో?!

ఆ తరువాత.. భార్య అరుదుగా నవ్విన ప్రతిసారీ సుబ్బారావు తండ్రి గుండెల్లో ఫిరంగులు మ్రోగాయి. ఏదో తలకు మించిన పనిని ఎదుటివారికి అప్పజెప్పే ముందే ఆమె అలా నవ్వుతుందని బాగా తెలిసిన వాడు కావడాన భార్య తాజా నవ్వు విని గతుక్కుమన్నాడు సుబ్బారావు తండ్రి. ఆమె నవ్వు నిజం కాకపోతే బావుండునని అనుకున్నాడు. ఊహు నవ్వక నవ్వక నవ్విన ఆవిడ నవ్వు నిజం కాకుండా ఎలా ఉంటుంది?

''మన సుబ్బిగాడికి పెళ్ళి చేయాలండీ!'' అందామె.

అంతే! చేతిలోని కప్పును అలానే జారవిడిచి, ''ఏవిటీ?'' అన్నాడతను భయంభయంగా చూస్తూ.

''నిక్షేపంలాంటి కాఫీ కప్పు పగలగొట్టారు. పోతే పోయింది లెండి. మన సుబ్బిగాడికి పెళ్ళయితే అదే చాలు'' అందామె తిరిగి.

ఆమె ఎప్పుడూ అంతే! తన మనసులో ఓ ఆలోచన వచ్చిందంటే చిన్నచిన్న విషయాలను పట్టించుకుని అనవసరంగా మూడ్ పాడు చేసుకోదు. ఆ సమయంలో కాఫీ కప్పు కాదు కదా. ఆమె పుట్టింటి నుంచి తెచ్చుకున్న భోషాణం సైజు రేడియోను ఎత్తి క్రింద పడేసినా ఏమీ అనదని అతడికి తెలుసు.

కొండ మీది నుంచి కోతిని తెమ్మన్నా, కొమ్ములున్న కుందేలును తెమ్మన్నా, ఇసుకలోంచి నూనెను పిండమన్నా, అతడంత దిగులు పడకపోయే వాడేమో! సుబ్బారావుకు తగిన పిల్లను వెదకడమనే ఊహ మనసులోకి వస్తేనే చాలా భయంగా ఉందతడికి.

తారు డబ్బా కూడా సిగ్గుపడేటంతటి నలుపు రంగులో వెన్నెట్లో మిలమిలా మెరిసిపోయే సుబ్బారావుకు పిల్లను వెతకటం, తానింతవరకూ చేసిన పనులన్నిటిలో కెల్లా కష్టాతి కష్టసాధ్యమైన పనని అతడికి తెలుసు. వాణ్ణి కన్న పుణ్యానికి ఆ బాధ్యత తనదేనని కూడా తెలుసతడికి.

కానీ అతడి మనసులో ఏమూలో తనకు తగిన జోడీని కొడుకే వెదుక్కుంటాడేమోననే ఆశ కూడా లేకపోలేదు. కానీ భార్య వెలిబుచ్చిన అల్టిమేటమ్‌లాంటి కోరిక వినడంతో అతడి సర్వనాడులూ చచ్చుపడిపోయాయి.

అయినప్పటికీ ''అలాగేలే'' అన్నాడు అతికష్టం మీద. ఇంకేమన్నా భార్య ఊరుకోదని బాగా తెలుసతడికి. అతడి నోట్లోంచి ఆ మాటలా వెలువడిందో లేదో సుబ్బారావు తల్లి ఒక్క ఉదుటున ఇంట్లోకి పరుగెత్తి 'మా బుచ్చి బాబు పెళ్ళి కొడుకాయెనే!' అంటూ మధ్య మధ్యలో మెటికలు విరుస్తూ కొడుకు చుట్టూ తిరగసాగింది.

పెళ్ళి మాట వినపడగానే సుబ్బారావు ఉలిక్కిపడ్డాడు. ''హమ్మా... నీకిది న్యాయమేనా? ప్రేమించి పెళ్ళి చేసుకునే హక్కు కూడా నాకు లేదా?'' అంటూ దిక్కులు పిక్కటిల్లేలా విలపించసాగాడు.

కొడుకు ధోరణి అర్థంకాక కాస్సేపతడి చుట్టూ తిరగడం ఆపు చేసిన సుబ్బారావు తల్లి, ఓ నిమిషమతడి వైపు చూసి అంతలోనే కర్తవ్యోన్ముఖురాలై ''బుజ్జి

## రవీనా 'సీరియస్' నటన

తన మాజీ 'అక్షయ్' గార్ని తిట్లతో కడిగేసి, తూర్పారబెట్టి – ఇక ఛాల్లే అనుకుందో, ఏమో! రవీనా హఠాత్తుగా తన కెరీర్ వేపు దృష్టి పెట్టి సీరియస్‌గా పన్లేసుకోవాలని నిశ్చయించుకున్నట్టే ఉంది. ఫలితాలెలా ఉంటాయో ఎవ్వరికీ తెలీదు. త్వరలో రిలీజవుతోన్న 'షూల్' చిత్రంలో తన నటన చర్చనీయాంశంగా ఉంది. రవీనా నిజంగా అదృష్టవంతురాలు. రవీనాకి బాలీవుడ్‌లో ప్రస్తుతం స్వర్ణయుగంలా ఉంది. నిజం చెప్పాలీ అంటే, బాలీవుడ్‌లో ఒక్క రవీనాకే రెండో ఛాన్స్ దొరికింది. ఒకసారి ఫెయిలైతే పెట్టే బేడా సర్దుకుని పోవాల్సిందే సాధారణంగా. 'షూల్' ఏం చేస్తుందో చూడాలి? విజయాన్ని సాధిస్తుందా? ఒక్క 'పోటు' పొడుస్తుందా? తనని ఖతం చేసేస్తుందా అంటూ సీరియస్‌గా ఆలోచిస్తూంది రవీనా. ఊరికే అక్షయ్ గూర్చీ, సన్నీడియోల్ గూర్చీ ఆలోచించడం కన్నా ఇలా ఆలోచిస్తే మంచిదేగా!





## 'మాయాబజార్' 50 సార్లు చూసిన నటుడు

*డాక్టర్‌కాబోయి, యాక్టర్ కావడం సినీ సంప్రదాయం. ఎవరిని ఇంటర్వ్యూ చేసినా ఇదే మాట (బహుశా రెండూ ఎనాటమీ పేపర్లు కలిగి ఉండటం గామోసు!) కోట శ్రీనివాసరావ్ కూడా మినహాయింపేంకారు. అయితే ఆయన మాత్రం డాక్టరవ్వాలని అనుకోలేదుట. వారి తండ్రి పెద్ద డాక్టర్ కావడంతో, ఆయన కోట గార్నీ డాక్టర్ చెయ్యాలనుకున్నారు, ఈయన మాత్రం యాక్టరయ్యారు. ఇంతకీ సంగతేంటంటే, కోట శ్రీనివాసరావ్‌కి సిన్మాలంటే 'పిచ్చి'గా ఉండేదిట. 'మాయాబజార్' సిన్మా వాళ్ళ ఊర్లో 50 రోజులాడితే, ఆ యాభై రోజులూ, రోజూ వాళ్ళ నాన్న జేబులో డబ్బు కొట్టేసి – ఆ టైంకి ఏ షో ఆడితే ఆ 'షో' గప్‌చిప్‌గా చూసొచ్చేవారట. స్కూల్‌లో కూడా అల్లరి పన్లు బానే చేశాట్ట కోట. ఓ రోజు మాష్టారిని అల్లరి చేద్దామని 'ఈ గంట దాస్ గారి హరికథ' అని బోర్డు మీద రాసి 5 రోజులు సస్పెండై, 5 రూపాయల ఫైన్ కూడా కట్టారట.*

బాబు పెళ్ళి కొడుకాయెనే!'' అని మళ్ళీ రాగం అందుకుంది.

ООО

ఎట్టకేలకు ఆరు నెలల తర్వాత సుబ్బారావు ఓ ఇంటి వాడయ్యాడు. పెళ్ళి కొచ్చిన వాళ్ళంతా సుబ్బారావు అదృష్టాన్ని, అతడి ఎదురుగానే పొగిడి, ''ఆహా... ఏం ఈడూ! ఓహో ... ఏం జోడూ!'' అని పెళ్ళి పందిరంతా ఊగిపోయేలా హాహాకారాలు చేశారు.

కానీ చిత్రంగా, పెళ్ళికొచ్చిన వారిలో ఏ ఒక్కరూ సుబ్బారావు తండ్రిని గుర్తించలేదు. పందిట్లో ఓ మూలగా కూర్చుని, ''నా పనైపోయింది, ఇహనా పనైపోయింది'' అంటూ సంబరంగా చంకలెగరేస్తూ కేరింతలు కొడ్తోన్న అతడిని చూసి చాలా మంది, 'ఎవరో మతి చెడిన దూరపు బంధువు పెళ్ళికొచ్చాడేమో!' అనుకున్నారు తప్ప అతణ్ణి సుబ్బారావు తండ్రిగా ఎవరూ గుర్తించలేదు.

ఆ ఆరు నెలల్లోనూ తలంతా నెరిసిపోయి, మొహం పీక్కుపోయి పూర్తిగా పిచ్చి రూపొచ్చేసిందతడికి మరి! చింతపల్లిలో పేవ్‌మెంట్ మీద అడుక్కునే వాడి దగ్గర్నుంచి, చికాగోలో వ్యాపారం వెలగబెట్టే వాడి వరకూ ఎవరికైనా పెళ్ళి తర్వాత శోభనం జరగాల్సిందే కదా!

కనుక కొత్త పెళ్ళి కొడుకు సుబ్బారావుకూ, కొత్తగా పెళ్ళయిన సుబ్బలక్ష్మికీ, ఆ ముచ్చట కూడా జరిగింది. ఔత్సాహికులు తలుపు సందుల్లోంచి వీక్షిస్తున్న నేపథ్యంలో.

మర్నాడు సుబ్బారావుకు వరసైన ఆడ వాళ్ళు అతణ్ణి ఆట పట్టించడంతో పాటు, 'శోభనం రోజే పెళ్ళాం చేతిలో కుక్కిన పేనులా ఉన్న నిన్ను చూస్తోంటే మాకు బోల్డు జాలేస్తోంది' అని పవిట కొంగుల్తో కళ్ళొద్దుకునే ప్రయత్నం చేయబోయారు కూడా.

అందుకు సమాధానంగా 'హ్హె హ్హె హ్హె' అన్నాడు సుబ్బారావు.

పాపం... అతడేడవలేక నవ్వబోయాడని అర్థమైంది వారికి.

కొత్త పెళ్ళి కొడుకును మరీ అంతకంటే ఎక్కువగా ఏడ్పించడం బావుండదని భావించి అక్కడి నుంచి కదిలి సుబ్బలక్ష్మి దగ్గరకు వెళ్ళారు. తన ఈడు పిల్లల్నంత మందిని ఒక్కసారిగా చూడ్డంతో అమితంగా సిగ్గుపడిపోయింది సుబ్బలక్ష్మి.

పైగా అప్పుడామె, రాత్రి మొహానికి అంటిన బొట్టూ, కాటుక వగైరా మరకల్ని తుడుచుకునే ప్రయత్నంలో ఉంది. వాళ్ళా గదిలోకి ప్రవేశిస్తూనే, ''మా సుబ్బారావు చాలా అదృష్టవంతుడు సుబ్బులూ!'' అన్నారు ముక్తకంఠంతో.

అంతవరకూ ఆమె మొహాన్ని ఆవరించిన సిగ్గు ఛాయలు మటుమాయమై పోయాయి.

''అంటే... నేను దురదృష్టవంతురాలిననేగా!'' అంటూ నిలదీసింది సుబ్బలక్ష్మి.

''ఊహూ. మా ఉద్దేశమదికాదు. మీరిద్దరూ మేడ్ ఫర్ ఈచ్ అదర్‌లా ఉన్నారన్న మాట'' అంది ఒకమ్మాయి, తెలివిగా మాట్లాడాననుకుని మురిసిపోతూ.

''అంటే.. అంటే.. నేను కూడా ఆయనంత నల్లగానూ ఉన్నాననేగా అర్థం!'' అంది సుబ్బలక్ష్మి రొప్పుతూ.

''అబ్బెబ్బే... మా ఉద్దేశం అదికాదు. నిన్న రాత్రి చూశాం కదా మీ ఇద్దర్నీ! అందుకన్న మాట అలా అన్నది'' అంది మరో అమ్మాయి, ఆ మాటతోనైనా తాత్కాలికంగా సిగ్గుపడి సుబ్బలక్ష్మి టాపిక్ మారుస్తుందేమోనని.

కానీ సుబ్బలక్ష్మి అందుకు భిన్నంగా మంచం మీద కూర్చుని ఉన్నదల్లా దిగ్గున లేచి నిలబడి పవిట కొంగు నడుం చుట్టూ తిప్పి చీరలో దోపి, ''హవిటీ... రాత్రి... మా ఇద్దర్నీ...'' అని ఇంకా ఏదో అనేలోగా అందరూ అక్కడి నుంచి మాయమై పోయి సుబ్బారావు తల్లి దగ్గర చేరి, ''మీ కోడల్తో ఎలా వేగుతారో ఏవిటో?'' అంటూ కొత్తఅధ్యాయం ప్రారంభించారు.

మరి సుబ్బారావు దురదృష్టమో, సుబ్బలక్ష్మి అదృష్టమోగానీ పెళ్ళయిన పది రోజులకే సుబ్బారావుకి పొరుగూళ్ళో ఉద్యోగం రావడమూ, భార్యా సమేతంగా అతడు వేరింటి కాపురం పెట్టవలసి రావడమూ జరిగిపోయాయి.

పెళ్ళికి ముందెలానూ తన బ్రతుక్కి ప్రేమయోగం లేదు. కనీసం పెళ్ళయ్యాక పెళ్ళాన్నైనా బుద్ధిగా ప్రేమించుదామనుకున్న సుబ్బారావు కనీసపు కోరిక కూడా తీరే దారికనిపించలేదు.

అతడు 'భార్యను ప్రేమించడమెలా?' అనే పుస్తకం చదివితే, ఆమె 'భర్తను సాధించడమెలా?' అనే టాపిక్ మీద వివిధ పత్రికల్లో వెలువడే వ్యాసాలు చదివేది.

''బొత్తిగా ఢిల్లీ గేదెలా ఉన్న నీకు నైటీలూ, చుడీదార్‌లూ బావుండవు గానీ, చక్కగా చీరలు కట్టుకో మహాలక్ష్మీ!'' అంటే అందుకు సమాధానంగా తనకు కొమ్ములు లేకపోయినా అచ్చం గేదెలానే తలవంచి అతడి కడుపులో ధన్‌మని గుద్దింది సుబ్బలక్ష్మి ఓ రోజు.

కొడుకు చేత్తో పట్టుకుని గింగిరాలు తిరుగుతూ,

''ఘటోత్కచుడి చెల్లెల్లా అంత బలమెక్కడి నుంచి వచ్చిందే నీలో'' అంటూ మూలుగుతూనే పడుకోవాల్సి వచ్చింది సుబ్బారావారోజు.

మరో రోజు సుబ్బలక్ష్మి మంచి మూడ్‌లో ఉండగా, ''నీకు పౌడర్ డబ్బాలు కొనడం నా వల్ల కాదు గానీ ఏదైనా సున్నపు బట్టీ లీజుకు తీసుకుంటాను. దాంట్లో పడి దొర్లితే నాకు ఖర్చైనా తప్పుతుంది'' అన్నాడు సుబ్బారావు తను చిలిపిగా మాట్లాడాననుకుని మురిసిపోతూ.

అంతే! పరుగు పరుగున పెరట్లోకి వెళ్ళి ముగ్గు డబ్బా తెచ్చి భర్తనెత్తిన గుమ్మరించి, ''ఇప్పుడద్దంలో చూసుకోండి.... ఎంతందంగా ఉన్నారో?'' అంది సుబ్బలక్ష్మి పకపకా నవ్వుతూ.

తర్వాత వివిధ సందర్భాల్లో సుబ్బలక్ష్మిని బకాసురుడి మరదలితోనూ, శూర్పణఖ చెల్లెలితోనూ, ఊర్మిళ మేనత్తతోనూ, తాటకి తోడబుట్టిన దానితోనూ, లక్ష్మీదేవి అక్కగారితోనూ, జాంబవతి తండ్రితోనూ పోల్చి తత్ఫలితంగా తిట్లూ, శాపనార్థాలూ, తాపులూ తిని 'షటప్' అయిపోవడంలో ఉన్న సుఖం దేనిలోనూ లేదని నిర్ధారణకు వచ్చిన వాడై అసలు సిసలు సన్యాసిలా కాలం వెళ్ళమార్చటం అలవాటు చేసుకున్నాడు సుబ్బారావు.

కానీ మునులకు తపోభంగం కలిగించడంకోసం రంభనో, మేనకనో, వాళ్ళ చుట్టాలమ్మాయిల్నో ఆయా మనుషుల వీక్ పాయింట్స్ ననుసరించి ప్రత్యేకంగా ఎంపిక చేసి భూలోకంలోకి పంపించకపోతే దేవేంద్రుడి కారోజు నిద్ర పట్టని చందంగా, మొగుడు తన జోలికి రాకపోయినా, అతడి చొక్కానో, పాంటునో పట్టుకుని లాగి కయ్యానికి కాలు దువ్వడం సుబ్బలక్ష్మికి నిత్యకృత్యమైంది.

దాంతో చెదిరిపోయిన సుబ్బారావు ప్రేమ విషయం పూర్తిగా మరిచిపోయి ఈ ఉపద్రవాన్నుంచెలా తప్పించుకోవాలా? అని సీరియస్‌గా ఆలోచించాడు.

ఓ రోజు సుబ్బలక్ష్మి ఎంతో ప్రేమగా వండి, మరెంతో అనురాగంతో వడ్డించిన కాకరకాయ వేపుడు తిన్న అతడి మనసు మధురాతి మధురమైన అనుభూతికి లోనైంది. ఆ మైకంలో అతడుండగానే అతడికో అద్భుతమైన ఆలోచన వచ్చింది. సుబ్బలక్ష్మితో తన సంసారం ప్రేమమయంగా సాగాలంటే ఏం చేయాలో అర్థమైందతడికి.

కాస్సేపటికి... వంటిల్లు సర్దుబాటు చేసుకుని తన పక్కలో చేరిన భార్యతో ''నువ్వెవర్నైనా ప్రేమించావా... సు'' అనబోయి ''లక్ష్మీ!'' అన్నాడు సుబ్బారావు, ఎందుకైనా మంచిదని దూరంగా జరుగుతూ. సుబ్బలక్ష్మికి ఎందుకో ఆ సమయంలో కోపంరాలేదు.

''ఊ...'' అందామె పరవశంగా కళ్ళు మూసుకుని.

భార్య సమాధానం విని మంచంమీద అంతెత్తున ఎగిరిపడ్డాడు సుబ్బారావు. ''నువ్వు... నువ్వు... పెళ్ళికి ముందు ఎవర్నైనా ప్రేమించావా లక్ష్మీ!'' అన్నాడు ఏడుపు గొంతుతో.

''ఊ..'' అంది సుబ్బలక్ష్మి మళ్ళీ. ఆమె గొంతులో అదే పరవశం!

ఏడుపును గొంతులోనే అదిమిపట్టి, ''ఆ అదృష్టవంతుడెవరో చెప్పవూ?'' అన్నాడు సుబ్బారావు బ్రతిమాలుతున్నట్టుగా.

''ఊ... నా చిన్నప్పుడు మా ఇంట్లో ఓ గేదె దూడ ఉండేది. అదంటే చాలా ఇష్టం నాకు. తర్వాతేమో మా ఇంట్లో ఓ బొచ్చుకుక్క పిల్ల ఉండేది. అదన్నా నాకిష్టమే! తర్వాతేమో...'' అనబోయిన సుబ్బలక్ష్మిని వారించి, ''నేనడుగుతోంది జంతువుల గురించి కాదు చిట్టీ, మనుషులు... మనుషుల గురించి చెప్పు'' అన్నాడు సుబ్బారావు ఆత్రంగా.

వెంటనే సుబ్బలక్ష్మి మొహం సీరియస్‌గా మారిపోయింది. ''పెళ్ళి కాని పిల్లలు పరాయి మగాళ్ళను ప్రేమించడమేమిటీ? తప్పుకాదూ?'' అంది ఉరుము ఉరిమినట్టుగా.

'మా తల్లే... మా తల్లే... నీ ఏబ్రాసి మొహం చూసి ఎవడూ ముందుకొచ్చి ఉండడు' అని గొణుక్కుంటూ, ''అవునవును మా బాగా చెప్పావ్? నేను కూడా అంతే! పంది పిల్లల్నీ, మేక పిల్లల్నీ, గాడిద పిల్లల్నీ మన పెళ్ళికి ముందు ఎంతగా ప్రేమించే వాడినో!'' అన్నాడు సుబ్బారావు, తన క్లాస్‌మేట్ మధుబాలను తలచు కుంటూ.

''భలే.. భలే... మీరు కూడా నాలాగే నన్నమాట!'' అంది సుబ్బలక్ష్మి, హైస్కూల్‌లో తన బుగ్గ మీద ముద్దు పెట్టుకున్న వెంకటాచలాన్ని తల్చుకుని మురిసిపోతూ.

''మరే.. మరే... ఈ రోజుల్లో ఏ విద్యా సంస్థనైనా స్థాపించేందుకు కావాల్సిన గొప్ప అర్హత - చదువులో ఓనమాలు రాకపోవడమో లేదా అన్ని తరగతుల్లోనూ వరుసగా డింకీలు కొట్ట డమో కదా! అందుకే మనిద్దరికీ ఎలానూ మనుషుల మధ్య ప్రేమ విషయంలో పూర్వానుభవం లేదు కనుక 'ప్రేమించడమెలా?' అనే విషయం మీద యువతీ యువకులకు సలహా లిచ్చే స్కూలొకటి మనమే ప్రారంభిస్తే ఎలా ఉంటుందంటావ్?'' అన్నాడు ఓ వైపు భయంగా ఉన్నా అసలు విషయానికొస్తూ.

''హబ్బ... ఎంత కాలానికి మీకో మంచి అయిడియా వచ్చిందండీ?'' అంటూ తెగ మురిసిపోతూ మొగుణ్ణి మొదటిసారిగా ప్రేమగా ఆలింగనం చేసుకుంది సుబ్బలక్ష్మి. అదే మొదటిసారీ, చివరి సారీ కూడా ఆమె అతణ్ణి ప్రేమగా దగ్గరకు తీసుకోవడం. ఆ తర్వాత ఒకరితో ఒకరు పోట్లాడుకుందుక్కాదు కదా, మాట్లాడుకుందుక్కూడా తీరిక దొరకలేదు వారిద్దరికీ.

ఎందుకంటే మర్నాడే వారింటి ముందు, 'ప్రేమ పాఠశాల' అనే బోర్డు వ్రేళ్ళాడింది తాటికాయలంతేసి అక్షరాల్తో.


రూ. 2,50,000/-ల విలువగల బహుమతులు గెలుపొందండి

| | | |
|---|---|---|
| 10 | | |
| | 11 | |
| | | 12 |

ప్రత్యేక బహుమతి:
హీరోహోండా
మోటార్‌సైకిల్
(లేదా) ఛేతక్ స్కూటర్
(లేదా) కలర్ టి.వి.

| | | |
|---|---|---|
| 8 | 13 | 6 |
| 7 | 9 | 11 |
| 12 | 5 | 10 |

కన్సొలేషన్ బహుమతులు:
మ్యూచువల్ బెనిఫిట్ పథకం ప్రకారం కెమెరా, టూ-ఇన్-వన్, ట్రాన్సిస్టర్, శారీస్, రిస్ట్‌వాచ్

పై నమూనాలో వలె ఇన్‌లాండ్/ఎన్వెలప్‌పై 9 ఖాళీ గడులను గీయండి. 7 నుండి 15 వరకు గల అంకెలను ఉపయోగిస్తూ నిలువుగా, అడ్డముగా, ఏటవాలుగా ఎటు కూడినా మొత్తం 33 వచ్చేలా చూడండి.

ఒక అంకెను ఒక్కసారి మాత్రమే ఉపయోగించాలి. మీ ఎంట్రీలను 10 రోజులలోగా ఆర్డినరీ మెయిల్ ద్వారా పంపండి. ముందుగా చేరిన 10 ఎంట్రీలకు టైటాన్ వాచ్ గోల్డెన్ చైన్ బహూకరించబడును.

SIGMA SALES INDIA (W-4)
DALLUPURA
DELHI - 110 096